# అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు





**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

"ప్రజల సౌకర్యార్థం చెన్నూరు నియోజకవర్గంలో అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది" అని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం మందమర్రి పట్టణం దీపక్ నగర్ వార్డులో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గంలో రహదారులు, అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణంలో సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. మందమర్రి దీపక్ నగర్‌లో 12 లక్షల రూపాయల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు తెలిపారు. మందమర్రి మున్సిపల్ పరిధిలో రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు 18 కోట్ల రూపాయలు మంజూరు చేసి పనులు చేపట్టినట్లు వివరించారు. స్మశాన వాటికకు సాంకేతిక అనుమతులు మంజూరయ్యాయని, అంబేద్కర్ భవన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో సోలార్ లైటింగ్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్నామని, అమృత్ పథకం కింద చెన్నూరు, క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీలలో 100 కోట్ల రూపాయలతో పనులు చేపట్టామని తెలిపారు. ప్రతి ఇంటికి నిరంతరాయంగా త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అర్హులైన నిరుపేదలకు రెండు పడక గదుల ఇండ్లు కేటాయించామని, అసలైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. తొలి విడతలో ఇండ్లు రాని వారు ఆందోళన చెందవద్దని, తదుపరి విడతలో అర్హులకు అందిస్తామని తెలిపారు. మందమర్రిలో బస్సు సౌకర్యంపై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. మందమర్రి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. సీఎస్ఆర్, డీఎంఎస్‌టీ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో సోలార్ లైటింగ్ ఏర్పాటు, అమృత్ పథకం కింద ప్రతి ఇంటికి త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రహదారులు, మురుగు కాలువలు, సోలార్ లైటింగ్ ఏర్పాటు ద్వారా ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు.

**అంబేద్కర్ భవన నిర్మాణానికి భూమి పూజ**

జైపూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి మంత్రి గడ్డం వివేకానంద భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గంలో ప్రజల సౌకర్యార్థం రహదారులు, అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టామని చెప్పారు. ప్రతి గ్రామంలో సోలార్ లైటింగ్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. జైపూర్ మండలంలో బాబు జగ్జీవన్ రామ్ భవన్ నిర్మాణానికి 25 లక్షల రూపాయలు మంజూరు చేసి త్వరలో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ తెగల కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామని వివరించారు. జైపూర్ మండలంలో మూసివేసిన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలోని నర్సరీని తిరిగి ప్రారంభించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక అభివృద్ధి అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో 20 లక్షల రూపాయల వ్యయంతో ఇందిరా మహిళా భవన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**క్రిస్మస్‌ను సంతోషంగా జరుపుకోవాలి**

"క్రిస్మస్ పండుగను ప్రజలందరూ మతసామరస్యంతో, ఆనందంగా జరుపుకోవాలి" అని మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని జిల్లాలోని సోమగూడెం కల్వరి చర్చ్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పండుగను మతసామరస్యంతో, ఐక్యతతో జరుపుకోవాలన్నారు. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా పేదలకు సహాయం చేసి, వారికి చేయూత అందించి అభివృద్ధి బాట పట్టించాలని సూచించారు. ప్రజాసేవ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు అర్హులైన నిరుపేదలకు చేరేలా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కృషి చేయాలని పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి చర్చ్‌కు పెయింటింగ్, విద్యుత్ దీపాలంకరణ కోసం ప్రభుత్వం 30 వేల రూపాయల చొప్పున మంజూరు చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రేమ, మానవీయ విలువలకు ప్రతీక క్రిస్మస్



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

"క్రిస్మస్ పర్వదినం సమాజంలో ప్రేమ, సౌభ్రాతృత్వం, మానవీయ విలువలను మరింత బలోపేతం చేస్తుంది" అని బీఆర్ఎస్ మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని హమాలివాడ సీఎస్ఐ వెస్లీ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట:"క్రిస్మస్ సందేశం శాంతి, ఐక్యతతో పా టు పరస్పర గౌరవాన్ని బోధిస్తుంది" అని నడిపెల్లి విజిత్ రావు పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని లక్షెట్టిపేట పట్టణంలోని సీఎస్ఐ చర్చి (మోదెల)లో నిర్వహించిన వేడుకల్లో నడిపెల్లి దివాకర్ రావు, నడిపెల్లి విజిత్ రావు పాల్గొని క్రైస్తవ సోదరులకు, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, లక్షెట్టిపేట పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, లక్షెట్టిపేట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు.



## చర్చి కి బియ్యం విరాళం

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా అల్లూరి శ్రీనాథ్ రెడ్డి యువసేన ఆధ్వర్యంలో గునుకుల కొండాపూర్ గ్రామంలోని చర్చికి బియ్యం విరాళంగా అందజేశారు. గురువారం యువ సేన తరఫున 50 కిలోల బియ్యాన్ని చర్చికి అందజేయగా, ఐదవ వార్డు సభ్యుడు సుధగోని సాయి తేజ గౌడ్ మరో 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భం గా పండుగల సమయంలో పేదలకు చేయూత అందించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటాలని నాయకు లు పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినం ప్రేమ, సేవ, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుం దని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రె స్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్లపల్లి రవికుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ సుద గోని మల్లేశం గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయ కులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కొరివి శ్రీనివాస్, గొల్లపల్లి హరీష్, కొరివి నితిన్, నల్ల మహేష్, శివాజీ, సందీప్ కార్తీక్, పాస్టర్ వినోదమ్మ, కొరివి రాజవ్వ పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా గురువారం చర్చిలో వినోదమ్మ పాస్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గునుకుల కొండాపూర్ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, వార్డు సభ్యులు సుధగోని సాయి తేజ, సొల్లు హరీష్, నాలపట్ల పరశురాం, కొర్రి శ్రీనివాస్, సొల్లు ప్రవీణ్, నితిన్, గొల్లపల్లి కార్తీక్, గొల్లపల్లి మణికంఠ, మాసం అంజయ్య, కొరివి రాజవ్వతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం జంగపల్లి ఎక్స్ రోడ్‌లోని ప్రార్థనా మందిరంలో జాన్ పాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గునుకుల కొండాపూర్ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మతో పాటు జంగపల్లి ఎక్స్ రోడ్‌కు చెందిన మాజీ సర్పంచ్ అనుమాండ్ల శ్రీనివాస్, రాజయ్య, అఖిల్ వర్మ, బట్టుసంపత్ తదితరులు పాల్గొన్నారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు

## "క్రిస్మస్ శాంతి, ప్రేమ, ఐక్యతకు ప్రతీక"



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

"క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ, ఐక్యత సందేశాన్ని సమాజానికి అందిస్తుంది" అని ఎమ్మెల్యే సతీమణి, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని హమాలివాడ ఎంసీసీ సీఎస్ఐ చర్చి, లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని మిషన్ కాంపౌండ్, ఉత్కూర్ చౌరస్తా సీఎస్ఐ చర్చిల్లో జరిగిన కార్యక్రమాల్లో హాజరై చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు ఆయురారోగ్యాలు కలగాలని, మంచిర్యాల నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని ఆకాంక్షిస్తూ ప్రార్థించారు. ఈ సందర్భంగా చర్చి కమిటీ సభ్యులు కొక్కిరాల సురేఖను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ముద్దం నగేష్

### నూతన కార్యవర్గాన్ని అభినందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



ముద్దం నగేష్

గంగాధర మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని గురువారం మధురానగర్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం అధ్యక్షుడిగా ఉప్పరమల్యాల సర్పంచ్ ముద్దం నగేష్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మధురానగర్ సర్పంచ్ వేముల భాస్కర్, కాసారం సర్పంచ్ వేముల జ్యోతి దామోదర్, కొండాయపల్లి సర్పంచ్ మల్యాల వినయ్ సాగర్‌ను ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా కొండన్నపల్లి సర్పంచ్ రేండ్ల శ్రీనివాస్, కోశాధికారిగా బూరుగుపల్లి సర్పంచ్ దూలం కళ్యాణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ బాసవేణి శ్రీనివాస్, కురిక్యాల సర్పంచ్ కడారి రేణుక కనకయ్య, ర్యాలపల్లి సర్పంచ్ దీకొండ బాబలక్ష్మి మధు, నారాయణపూర్ సర్పంచ్‌లను నియమించారు. లీగల్ సెల్ అడ్వైజర్లుగా చర్లపల్లి (ఆర్) సర్పంచ్ కనకయ్య, నాగిరెడ్డిపూర్ సర్పంచ్ గునుకొండ యశో ద బాబు ఎంపికయ్యారు. గౌరవాధ్యక్షులుగా తాడిజెర్రి సర్పంచ్ రామిడి రాజిరెడ్డి, ఇస్లాంపూర్ సర్పంచ్ బారాజు ప్రభాకర్ రెడ్డి, సర్వారెడ్డిపల్లి సర్పంచ్ కరబూజ తిరుపతి గౌడ్‌లను ఎన్నుకున్నారు. సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. సర్పంచులు ప్రజల మధ్యలో ఉంటూ గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

## "అటల్ వాజ్‌పేయి దేశానికి ఆదర్శ నాయకుడు"



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

"దేశ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడు" అని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు కొలిపాక రాజు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. దేశ అభివృద్ధి కోసం అటల్ వాజ్‌పేయి ఎంతో కృషి చేశారని, భారత్ స్వయం సమృద్ధి సాధనకు ఆయన బలమైన పునాదులు వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు బుర్ర మల్లేశం గౌడ్, నాయకులు బోయినపల్లి అనిల్ రావు, కొత్తపేట రామచంద్రం, సంగ రవి, తూముల రమేష్, బండిపెల్లి శ్రీను, నర్సింగం, కోమిరే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జంకి జీపీ పాలకవర్గానికి సన్మానం



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బెజ్జంకి గ్రామ పంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన గ్రామ సర్పంచ్ బొల్లం శ్రీధర్ (పెద్దన్న), ఉపసర్పంచ్ దూమల మహేష్‌తో పాటు వార్డు సభ్యులకు స్వధర్మ ఫౌండేషన్ లింగాల సురేష్ మహారాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ప్రజాప్రతినిధులకు భారత రాజ్యాంగ ప్రతులను బహుకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాసేవలో నిజాయితీ, బాధ్యతలను మూలసూత్రాలుగా తీసుకుని గ్రామాభివృద్ధికి అంకిత భావంతో పనిచేయాలని నూతన ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెరిపోతుల రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చలి గుప్పిట్లో ప్రజలు..

## బోథ్, సోనాల మండలాల్లో తీవ్ర ప్రభావం

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**



ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా బోథ్, సోనాల మండలాల్లో చలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. సాయంత్రం వేళ చలి తీవ్రత అధికంగా ఉండటంతో అత్యవసరమైతే తప్ప బయటకు రావడం లేదని స్థానికులు తెలిపారు. ప్రొద్దున, రాత్రి వేళల్లో చలి మంటలు కాగుతూ గడుపుతున్న దృశ్యాలు గ్రామాల్లో కనిపిస్తున్నాయి. చలి కారణంగా వృద్ధులు, చిన్నారులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అవసరం లేకుండా బయటకు రావద్దని, వెచ్చని దుస్తులు ధరించాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారు హెచ్చరించారు.

